సాక్షి శ్రీకాకుళం

శనివారం, 6, జూలై, 2024

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకి ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్ సుజాత, ఓఎస్‌డీ కావ్యజ్యోత్స్న

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.శ్రీనివాసరావును శుక్రవారం వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా నియమిస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ పి.సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్, ఓఎస్‌డీ కావ్యజ్యోత్స్న ఉత్తర్వులు అందజేశారు. ఏడాదికి ఈ నియామకం వర్తిస్తుంది. ప్రతి ఏటా రెన్యువల్‌కు అవకాశం ఉంది. వర్సిటీ పరిధిలో క్రీడా ప్రగతి కోసం పనిచేయనున్నట్లు ఆయన చెప్పారు.

మిస్సింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : అపరిష్కృతంగా ఉన్న మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అన్ని పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్లతో మిస్సింగ్ కేసుల దర్యాప్తు, ఫైల్ స్టేజ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా వాటి ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి, సాంకేతిక ఆధారాలు, చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తప్పిపోయిన వ్యక్తులు ట్రేసింగ్ అయ్యేలా అన్నివిధాలా ప్రయత్నం చేయాలని, ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తుల ఇటీవల కాల్‌డేటా, ఆధార్, బ్యాంకు తదితర లావాదేవీలను పరిశీలించి ఎక్కడున్నారనే విషయాన్ని తెలుసుకుని ఆ చోటుకు పోలీసు బృందాలను పంపించి కేసులను ఛేదించాలన్నారు. సాంకేతిక ఆధారాల ద్వారా కూడా వ్యక్తుల సమాచారం తెలుసుకుని సంబంధిత వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడి పిలిపించి కేసులు పరిష్కరించాలని, యుక్తవయసులో తప్పిపోయిన బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్‌ఐలు పాల్గొన్నారు.

'అధికారులు అంకిత భావంతో పనిచేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారులు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆయన శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ జీఆర్ రాధిక, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి అందించే దిశగా అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించిన నాడే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, శ్రీకాకుళం, పలాస ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, భరత్‌నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, డీపీఓ వెంకట్రావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్‌డీఏ కిరణ్ కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఏపీసీ జయ ప్రకాష్, మైన్స్ డీడీ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, జిల్లా తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 16 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 16 మంది ఎంపికయ్యారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా నలుమూలల నుంచి 83 మంది యువతీయువకులు హాజరుకాగా.. వివిధ మౌఖిక పరీక్షల అనంతరం 16 మంది ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఆ సంస్థ ప్రతినిధులు ఎంపిక చేసినట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. వీరికి నియామక పత్రాలను అందజేసినట్టు ఆమె తెలిపారు.

పింఛన్లపై వంచన



- 2014–19 కాలాన్ని గుర్తు చేస్తున్న పరిస్థితులు
- ఉన్న పింఛన్లు తొలగించేందుకు యత్నాలు
- గ్రామస్థాయిలో జాబితాలు తయారు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- 2014–19లో ఇదే రకంగా వ్యవహరించిన టీడీపీ నాయకులు
- అప్పట్లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 74,194 పింఛన్ల తొలగింపు

2014లో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన నాటికి ఉన్న పింఛన్లు	2014 జూలై నాటికి పింఛన్లు	2014 సెప్టెంబర్ నాటికి పింఛన్లు
2,99,925	2,92,405	2,25,731
	మూడు నెలల వ్యవధిలో తీసేసిన పింఛన్లు	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగపోయేసరికి ఉన్న పింఛన్లు
	74,194	3,19,147

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గ్రామాల్లో టీడీపీ నాయకులు కక్ష సాధింపులకు శ్రీకారం చుడుతున్నారు. వారి ప్రయత్నాలు 2014–19 పరిస్థితులను గుర్తుకు తెస్తున్నాయి. తమకు గిట్టని వారి పింఛన్లను తొలగించే పనిలో టీడీపీ నాయకులు ఉన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే కొందరు పింఛన్లు ఆపేందుకు యత్నించారు. ఇప్పటికే కొంతమందిని ఇబ్బంది పెట్టారు. కానీ ప్రజల నుంచి ఆదిలోనే వ్యతిరేకత వస్తుందని ఆ ప్రయత్నాన్ని కొంతమేరకు విరమించారు. కానీ రానున్న రోజుల్లో తమకు కాని వారికి పింఛన్లు నిలిపేసేలా సన్నాహాలు చేస్తున్నారు. గ్రామస్థాయిలో అయిన వారెవరో, కాని వారెవరో గుర్తించే పనిలో పడ్డారు. జిల్లా, మండల స్థాయి నాయకుల సూచనల మేరకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

2014–19లో కూడా నిర్దాక్షిణ్యంగా తమ పార్టీకి చెందని వారి పింఛన్లు ఆపేసేశారు. అప్పట్లో టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి జిల్లాలో 2,99,925 పింఛన్లు ఉండగా, అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఆ పింఛన్ల సంఖ్యను 2,25,731కు కుదించేశారు. కేవలం మూడు నెలల వ్యవధిలో 74,194 పింఛన్లు తొలగించేశారు. ఆ తర్వాత కూడా వేలాది మంది పింఛన్లు ఆపేశారు. రకరకాల కొర్రీలు, సాకులు చూపించి పింఛన్లు ఆపేశారు. అప్పట్లో ఎంత మొత్తుకున్నా పట్టించుకోలేదు. అభ్యంతరాలు వ్యక్తం చేసినా, సందేహాలు నివృత్తి చేసినా తొలగించిన పింఛన్లను పునరుద్ధరించలేదు. జన్మభూమి కమిటీల దౌర్జన్యం, నియంతృత్వ పోకడతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పట్లో అర్హులైన అనేక మందిని జన్మభూమి కమిటీ సభ్యులు తొలగించేశారు. తమ పార్టీ కాదని, తమకు ఓటు వేయలేదని, తమ వర్గం కాదని అన్యాయంగా జన్మభూమి కమిటీ సభ్యులుగా ఉన్న టీడీపీ నాయకులు తొలగించేశారు. వారి సిఫార్సులే కొలమానంగా అప్పట్లో పింఛన్లు అందజేశారు. జన్మభూమి కమిటీ సభ్యులు కనుసన్నల్లో పింఛన్లు ఇచ్చిన పరిస్థితి ఉండేది. వారు ఇవ్వమంటే ఇవ్వడం, కాదంటే తొలగించడం జరిగేది. చెప్పాలంటే జన్మభూమి కమిటీల అరాచకం రాజ్యమేలింది. చివరికి తొలగింపునకు గురైన వారంతా కోర్టుకెళ్లి న్యాయం పొందారు. కోర్టు ఆదేశాలతో దశల వారీగా పునరుద్ధరించిన పరిస్థితి నెలకుంది.

ఇప్పుడు కూడా అదే రకంగా ముందుకెళ్తున్నారు. తమ పార్టీకి ఓటేయలేదనో, సానుభూతి పరులు కాదనో పింఛన్లు తీసివేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. అధికారులు చెప్పినట్టు చేస్తారని, తమకు కాని వారెవరో గుర్తించాలని గ్రామ స్థాయి నాయకులకు ఇప్పటికే సమాచారం వెళ్లింది. దీంతో వారంతా గ్రామస్థాయిలో పరిశీలన చేసి అయినవారెవరో, కాని వారెవరో గుర్తించే పనిలో పడ్డారు. రకరకాల కారణాలు ఎత్తి చూపి, ఏదో రకంగా పింఛన్లు నిలిపేసేలా వ్యూహరచన చేస్తున్నారు. గ్రామ స్థాయిలో జాబితాలు తయారు చేస్తున్నారు. చెప్పాలంటే అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే ఆ రకమైన ప్రయత్నం చేశారు. కాకపోతే పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో కొన్నిచోట్ల వెనక్కి తగ్గారు. జూలై నెలకు సంబంధించి ఆచితూచి వ్యవహరించినా భవిష్యత్‌లో కానివారి పింఛన్లు తొలగించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇలా తయారు చేసిన జాబితాలతో దూకుడుగా వెళ్తారో లేదంటే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని వేచి చూస్తారో చూడాలి. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం వారి ప్రయత్నాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 3,19,147 పింఛన్లు ఉన్నాయి. కుట్రలతో ఈ సంఖ్యను ఏం చేస్తారో చూడాలి.

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి పథంలో నడిపిస్తా..

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎంతో చైతన్యం కలిగిన జిల్లా శ్రీకాకుళం అని, అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ప్రజలు జిల్లాలో వ్యవసాయం పైనే ఆధారపడుతున్నందున ఆ రంగాన్ని ముందుకు తీసుకెళ్లడం తన తొలి ప్రాధాన్యత అని చెప్పారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా మీడియా ప్రతినిధులతో సమావేశమై ఒక్కొక్కరిని పేరుపేరునా పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన కొద్దిసేపు మాట్లాడారు.

తనది మహారాష్ట్ర అని, ఇంజినీరింగ్ చదివి, 2016 ఐఏఎస్ బ్యాచ్ అధికారిగా రాష్ట్రంలో అడుగుపెట్టి గుంటూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేసి, తర్వాత నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలిసారి విధుల్లో చేరిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కాకినాడ, విజయవాడ లాంటి పెద్ద కార్పొరేషన్లకు కమిషనర్‌గా పని చేశానని చెప్పారు. వ్యవసాయం, విద్య, వైద్యం లాంటి అంశాలపై పక్కా ప్రణాళిక రూపొందించుకుని ఫలితాలు సాధిస్తామని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. రెండు పెద్ద కార్పొరేషన్లకు కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నందున జిల్లాలో పట్టణాల అభివృద్ధికి తన వంతు సహకారం పూర్తి స్థాయిలో ఉంటుందని చెప్పారు. అనంతరం ఆయన జిల్లాలో ప్రధాన సమస్యల గురించి, వంశధార ప్రాజెక్టు, నదుల అనుసంధానం లాంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలపై విన్నపాలు విన్నారు. జిల్లాలో ఎలాంటి ప్రజా ప్రయోజన సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించవచ్చునని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు.

పింఛన్ల పంపిణీపై కలెక్టర్ ఆరా

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన శుక్రవారం కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

'సమీకృత కలెక్టరేట్ తొందరగా పూర్తి చేయాలి'



కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించారు. మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే ఇప్పుడే చేసుకోవచ్చన్నారు. ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకొని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్, జేసీ, ఇతర శాఖలకు సంబంధించిన అందరు జిల్లా అధికారులు ఈ కార్యాలయంలో ఉంటారని, అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే దగ్గర ఉండడం వల్ల పనులు సులభంగా జరుగుతాయని పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు'



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు ప్రసాదరావు, పక్కన ఏఎంఓ లక్ష్మీనారాయణ, ప్రభాకరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని, మారుతున్న పరిస్థితులను బట్టి బోధనా సరళిని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలని పాఠశాల విద్య రాష్ట్ర పరిశీలకులు ఇ.ప్రసాదరావు అన్నారు. జిల్లాలో జూలై 1 నుంచి మొదలైన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. మొత్తం 9 రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పెద్దపాడు, ఎచ్చెర్ల, టెక్కలి, సోంపేటలోని 4 కేంద్రాల్లో ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల అమలు తీరును రాష్ట్ర పరిశీలకులు ప్రసాదరావు మెచ్చుకున్నారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ స్కూల్ పెద్దపాడు శిక్షణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు అధిపతిగా ఉంటూ ఉపాధ్యాయుల బోధన సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించడానికి, వారు పరిశీలించినది మదింపు చేయడానికి, ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇవ్వటానికి ఈ టీచ్ టూల్ ట్రైనింగ్ తోడ్పడుతుందన్నారు. టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం ఉద్దేశం చాలా గొప్పదని, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులంతా బాటలు వేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ నక్క రామకృష్ణ, సీఎంఓ పేడాడ ప్రభాకరరావు, సాల్ట్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి, మాస్టర్ ట్రెయినర్లు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య సేవలు



విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.శేషగిరి, వైద్యురాలు డాక్టర్ పి.సౌమ్య, ఈఓ జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం శుక్రవారం కొనసాగించారు. విద్యార్థులందరికీ కడుపు నొప్పి ప్రధాన సమస్యగా ఉంది. ముగ్గురు విద్యార్థులను శుక్రవారం రిమ్స్‌కు స్కానింగ్ కోసం రిఫర్ చేశారు. ఇందులో ఒకరిని అతని తల్లిదండ్రులు జెమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాఠశాల డిస్పెన్సరీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పూర్తిగా ఆరోగ్య సమస్యలు అదుపులోకి వచ్చినట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ తాగునీటి సరఫరా అధికారులు మొత్తం బోరు బావులు నుంచి నీటి నమూనాలు సేకరించారు. నీటి నమూనాలు పరిశీలించనున్నారు. ప్రధానంగా విద్యార్థుల కడుపు నొప్పికి కారణాలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తాగునీరు వల్ల వచ్చిందా? బయట ఫాస్ట్ ఫుడ్ తినటం వల్ల సమస్యా? మెస్‌లో ఆహార పదార్థాలు వంటలో సమస్యా? అన్న అంశాలపై దృష్టి పెట్టారు. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో అవసరమైన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

దంచికొట్టింది



సరుబుజ్జిలి మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కుండపోత వాన కురిసింది. ఈ వానకు అలికాం- బత్తిలి అర్‌అండ్‌బీ రహదారి మొత్తం నీరు చేరింది. దీని వల్ల వాహనదారులు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు.

- సరుబుజ్జిలి



దేవదేవం భజే..



జగన్నాథ రథయాత్రకు సర్వం సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని బొందిలీపురంలో జగన్నాథ, సుభద్ర, బలరాముని విగ్రహాలకు రంగులు వేశారు. 6న నేత్రోత్సవం, 7 నుంచి రథయాత్ర జరుగుతుందని నిర్వాహకులు లక్ష్మీధరదాస్ భావాజీ, సురేష్ బ్రహ్మలు తెలిపారు.

- శ్రీకాకుళం కల్చరల్

ఆర్‌జీయూకేటీ డైరెక్టర్‌పై రాజీనామాకు ఒత్తిడి

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్ (ఎస్ఎంపురం) డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, ఇతర అధికారులపై రాజీనామాకు రాజకీయ ఒత్తిడి ప్రారంభమైనట్లు సమాచారం. విద్యా శాఖ మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు భోగట్టా. డైరెక్టర్ టర్మ్ మూడేళ్లు కాగా, ఈయన గత ఏడాది నవంబర్ 18న బాధ్యతలు చేపట్టారు. కనీసం ఏడాది సైతం పూర్తికాలేదు. మరో పక్క ఆర్‌జీయూకేటీ ఉన్నత అధికారి, న్యూజివీడు క్యాంపస్‌లో పలువురు అధికారులు వరసగా రాజీనామాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ సైతం రాజీనామా చేసి వెళ్లిపోవాలని ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఓఎస్‌డీగా పని చేస్తున్న ఎల్.సుధాకర్‌బాబు ఈ నెల 22వ తేదీన రిలీవై వెళ్లి పోయారు. విద్యాసంస్థలపై ఒత్తిళ్లను మేధావులు ఖండిస్తున్నారు.

ఉచిత శిక్షణ దరఖాస్తులకు గడువు పెంపు



శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఇ.అనురాధ తెలిపారు. దరఖాస్తు గడువు జూలై 10వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

'ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించాలి'



సమస్యల పరిష్కార వేదికలో చైర్మన్ సత్యనారాయణ

అరసవల్లి: విద్యుత్ శాఖలో వినియోగదారుల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు అధికారులు స్పందించాల్సిందేనని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక ఎంఆర్‌టీ భవన్‌లో శ్రీకాకుళం డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ఐదు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2005 నుంచి ఈ సీజీఆర్‌ఎఫ్ న్యాయస్థానం పనిచేస్తోందని, ఈ వేదిక ద్వారా ఇప్పటివరకు 7892 సమస్యలు నేరుగా పరిష్కరించామని, తద్వారా రూ.5,93,650 నష్టపరిహారాన్ని వినియోగదారులకు చెల్లించేలా చేశామని గుర్తు చేశారు. అలాగే ఇంకో 132 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై కూడా చర్యలు చేపడతామన్నారు. విద్యుత్ సరఫరాలో నాణ్యత లోపించినా, సేవలు సంతృప్తి కరంగా లేకపోయినా, అలాగే సిటిజన్ చార్టర్ ప్రకారం సేవలు అందకపోయినా వెంటనే 1912కు ఫ్రీ కాల్ చేసి వివరాలను తెలియజేయాలని, లేదా సీజీఆర్‌ఎఫ్ కార్యాలయం (విశాఖ)- 0891-2564704 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లున్నా తమను సంప్రదించాలని సూచించారు.

కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు వి.జనార్ధనరావు, ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, టెక్నికల్ ఈఈ ఎల్‌సిహెచ్ పాత్రుడు, ఏడీఈ బగ్గు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో శ్రీముఖలింగం మాడవీధుల్లో రోడ్లు



శ్రీముఖలింగంలో మాడవీధులు పరిశీలిస్తున్న డీఈఈ సత్యంనాయుడు తదితరులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయ మాడ వీధుల్లో ఏపీ టూరిజం, ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేయనున్నామని డీఈఈ సత్యం నాయుడు అన్నారు. శుక్రవారం శ్రీముఖలింగం ఆలయ మాడ వీధులు పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడారు.

నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు జేఈఈ శ్రీధర్, సర్పంచ్ టి.సతీష్ కుమార్, మాజీ సర్పంచ్‌లు తర్ర బలరామ్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలతో వ్యాపారాభివృద్ధి



టెక్కలిలో స్వదేశీ మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

టెక్కలి: మత్స్య సహకార సంఘాల్లో ఉన్న సభ్యులతో రైతు ఉత్పత్తిదారులు సమాఖ్యలుగా ఏర్పడి తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ సూచించారు. టెక్కలి మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం టెక్కలి, వద్ధితాండ్రకు చెందిన జగన్నాథ మత్స్యకార సొసైటీకి చెందిన స్వదేశీ మత్స్యకారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వంద మంది సభ్యులతో ఈ సమాఖ్యలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. దీని వల్ల సమాఖ్యలో ఉన్న సభ్యులకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందని అంతే కాకుండా వ్యాపారాలను మరింత విస్తరించవచ్చునని ఏడీ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ ధర్మరాజు, సహాయకుడు బి.మధు, సభ్యులు పద్మనాభం, కార్తీక్ బెహరా, హేరంబో, గోపి బెహరా, హన్నురావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో క్రమశిక్షణ కీలకం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ శాఖలో క్రమశిక్షణ కీలకమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.ప్రేమ్‌కాజల్ అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం ప్రత్యేక పోలీస్ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి అనంతరం మాట్లాడారు. పోలీసులు శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం పరేడ్ సాధన చేయాలని, శారీరక శ్రమకు తప్పని సరిగా రోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు పాల్గొన్నారు.


ఖైదీలకు అందుబాటులో న్యాయ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కారాగారంలో ఉండే ఖైదీలకు న్యాయపరమైన సలహాలు, న్యాయ సేవలు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం జైలులో ఉన్న ఖైదీలకు న్యాయ సహాయంపై న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఖైదీలకు బెయిల్ మంజూరు చేసే క్రమంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధా రణపై అవగాహన కలిగించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మోటారు వాహన చట్టాలు, అతిక్రమిస్తే చేపట్టే చర్యలపై అవగాహన పెంచాలన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ. 4.16 లక్షల చెక్కు



బాధిత కుటుంబానికి రూ. 4.16 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వరిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు జి.దాలయ్య కుటుంబానికి ఎస్పీ రూ. 4.16 లక్షల చెక్కును అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం దాలయ్య కుటుంబానికి హోంగార్డుల ఒక్కరోజు గౌరవవేతనం నగదు మొత్తాన్ని చెక్కు రూపేణా ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దాలయ్య కుటుంబ సభ్యుల్లో ఒకరికి హోంగార్డుగా నియామకాన్ని కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, హోంగార్డుల ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక లారీలను ఎచ్చెర్ల పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. పొన్నాడ పంచాయతీ ముద్దాడపేట ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా విశాఖపట్నం ఇసుక తరలిస్తుండగా బైపాస్ కూడలి వద్ద ఒకటి, పొన్నాడ వద్ద మరో లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనిపెట్‌కుని ఉండాలి



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ ఎం.ప్రసాదరావు (ఫైల్)

- పెంపుడు జంతువులతో జాగ్రత్త
- అతి చనువుతో వ్యాధులు సోకే ప్రమాదం
- నేడు 'వరల్డ్ జూనోసిస్ డే'

ఇచ్ఛాపురం రూరల్: పెంపుడు జంతువులను పెంచే సంస్కృతి పట్టణాల నుంచి పల్లెల వరకు పెరిగింది. ఇదివరకు కోళ్లు, మేకలు, ఆవులను పెంచేవారు. ఇప్పుడు ఎక్కువగా పెంపుడు కుక్కలను పెంచుకుంటున్నారు. అయితే మన సంరక్షణలోనే ఉంటున్నాయి కదా అని విస్మరిస్తే అసలుకే ప్రమాదం వస్తుందని వైద్యులు అంటున్నారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకుతాయని, వీటిని జూనోసిస్ వ్యాధులు అంటారని, అన్ని రకాల జంతువుల నుంచి ఇలాంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని, ముందుగానే జాగ్రత్త పడడం ఎంతో మేలని చెబుతున్నారు. వ్యాధులు సంక్రమించకుండా అవగాహన పెంపొందించుకోవడం, జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. నేడు వరల్డ్ జూనోసిస్ డే.

జూనోసిస్ డే ఎందుకు..?

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్‌పాశ్చర్ మొదటి సారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగారు. దీంతో అప్పటి నుంచి ఏటా జూలై 6న జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఏయే వ్యాధులు సోకే ప్రమాదం ఉంది?

- శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి.
- ఆవులు, గేదెలు వల్ల మశూచి, గాలికుంటు, రేబిస్, యాంత్రాక్స్, లిస్టీరియోసిస్, బ్రూసెల్లోసిస్, క్యూ ఫీవర్, క్షయ, తామర, మేటీసియోసిస్, ఫైలేరియాసిస్, హైడాటిడోసిస్, ట్రిపనసోమియాసిస్, టాక్సోప్లాస్మోసిస్ సోకే ప్రమాదం ఉంది.
- కుక్కలు, పిల్లులు, కోతుల వల్ల రేబిస్, లెప్టోస్పైరోసిస్, తామర, ట్రిపనసోమియాసిస్, టాక్సోప్లాస్మోసిస్, లార్వామైగ్రాన్స్, కాట్ స్క్రాచ్ ఫీవర్ వచ్చే అవకాశం ఉంది.
- గొర్రెలు, మేకల వల్ల రేబిస్, ఆంత్రాక్స్, లిస్టీరియోసిస్, బ్రుసెల్లోసిస్, క్యూ ఫీవర్, సాల్మొనెల్లోసిస్, హైడాటిసిస్, టాక్సోప్లాస్మోసిస్, ట్రిపనసోమియాసిస్ ప్రబలే ప్రమాదం ఉంది.
- ఎలుకల వల్ల లెప్టోస్పైరోసిస్, ప్లేగు సోకుతుంది.
- గుర్రాల వల్ల ఇన్‌ఫ్లూయెంజా, రేబిస్, ఆంత్రాక్స్, గ్లాండర్స్, తామర, క్రిప్టోకోకోసిస్, హిస్టోప్లాస్మోసిస్, లీష్మోనియాసిస్ వస్తాయి.
- పందుల వల్ల మెదడువాపు వ్యాధి, గాలికుంటు, ఇన్‌ఫ్లూయంజా, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లోసిస్, హైడాటిడోసిస్, తామర, ట్రైఖినెల్లోసిస్ వచ్చే అవకాశం ఉంది.
- కోళ్లు, పక్షుల వల్ల ఇన్‌ఫ్లూయంజా, క్లమీడియోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లోసిస్, క్షయ, తామర, సిట్టకోసిస్ రావచ్చు.

జూనోసిస్ రోగాలు ఎలా వస్తాయి..?

రేబిస్ సోకిన కుక్కలను ముట్టుకున్నా, ముద్దు చేసినా వ్యాధి అంటుకుంటుంది. వ్యాధులు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నా కూడా మనుషులకు వ్యాధులు వ్యాపిస్తాయి. కుక్కలు తదితరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినప్పుడు దుస్తుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యంత ప్రమాదకరం.

ఇవి పాటించాలి

జంతువులు, పక్షుల వల్ల వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవులు పరిసరాల్లోకి వ్యాపించి మానవుల్లో వ్యాధులకు కారణమవుతాయి. ఇటీవల కుక్కలను పెంచటం ఎక్కువైంది. పెంపుడు జంతువులున్నప్పుడు ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచాలి. ఇంట్లో పిల్లలు కుక్కలతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి. లేదా చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడగాలి. జంతువులు తిన్న ఆహార పదార్థాలను చిన్న పిల్లలు తినకుండా చూడాలి. జంతువులను ముట్టుకున్న తర్వాత పిల్లలైనా, పెద్దలైనా చేతులు నోట్లో పెట్టుకోకుండా చూసుకోవాలి. మనం తినే కంచాల్లో అవి మూతి పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అత్యంత ప్రధానంగా పెంపుడు కుక్కలకు ప్రతి 6 మాసాలకోసారి తప్పని సరిగా టీకాలను వేయించాలి. జబ్బు పడిన పశువుల పాలను తాగకూడదు. చనిపోయిన పశువులను సున్నపు గుంటల్లో లోతుగా పాతిపెట్టాలి. రోజూ మనం తాగే పాలను తప్పని సరిగా వేడి చేసి మరిగించాలి. అదే విధంగా బాగా ఉడకబెట్టిన మాంసాన్నే తినాలి. పశు వైద్యులు, సిబ్బందిని సంప్రదించి వ్యాక్సినేషన్, వ్యాధుల నివారణ తదితర వివరాలు తెలుసుకొని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. టీకాలు క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం వేయాలి.

టీకాలపై నిర్లక్ష్యం వద్దు



ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే స్థానిక పశువైద్యాధికారి సలహాలు తీసుకోవాలి.

– డాక్టర్ అప్పలస్వామి, పశువైద్య ఉప సంచాలకులు. ఇచ్ఛాపురం

విస్మరిస్తే ప్రమాదమే



కుక్కలు, కోతులు, పిల్లులు, ఎలుకలు వంటి జంతువులు కరిచిన వెంటనే విస్మరించకుండా వెంటనే గాయంపై 4,5 సార్లు నీటిని ధారగా పోస్తూ గాయాన్ని పరిశుభ్రంగా కడగాలి. అనంతరం గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాక్సినేషన్ చేయించుకోవాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

– డాక్టర్ వై.కల్యాణి, వైద్యాధికారిని, కొళిగాం పీహెచ్‌సీ, ఇచ్ఛాపురం మండలం

విత్తనాలు, ఎరువుల విక్రయాల నిలిపివేత



మోడరన్ రైస్ మిల్లు గోదాంలో ఎరువులు నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: స్థానిక శ్రీకృష్ణా మోడరన్ రైస్ మిల్లు, గుడ్ల కృష్ణారావు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు నిలుపుదల చేయాలంటూ తనిఖీ అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కొత్తూరులోని శ్రీకృష్ణా మోడరన్ రైస్ మిల్లు, గుడ్ల కృష్ణారావు విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను శ్రీకాకుళం విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్ కుమార్, తాడేపల్లిగూడెంకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, జిల్లా నాణ్యత నియంత్రణ అధికారి ఎల్.మురళీధర్, స్థానిక ఏఓ శ్రీనివాసరావు కలిసి సంయుక్తంగా తనిఖీ చేశారు. సరుకులకు సంబంధించిన రికార్డులు, గోదాంలో ఉన్న నిల్వలను పరిశీలించారు. రూ.34 లక్షల వరకు తేడాలు ఉన్నట్లు గమనించి విక్రయాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. తేడాలు గుర్తించిన నిల్వలకు సంబంధించిన పత్రాలను స్థానిక ఏఓకు అందజేయాలని సూచించారు. పత్రాలు సమర్పించేంత వరకు సరుకులు విక్రయించకూడదని ఆదేశించారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్రమ ఇసుక తవ్వకాలను నిషేధించడానికి పెద్ద ఎత్తున పబ్లిసిటీ ఇవ్వాలని, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఆయా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల నివారణ కోసం నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను ఆయన తన ఛాంబర్‌లో శుక్రవారం సాయంత్రం మైన్స్ డీడీ సత్యనారాయణతో కలిసి విడుదల చేశారు. ఇసుక విషయంలో ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఫిర్యాదుల కోసం హెల్ప్ లైన్

సుప్రీంకోర్టు ఉత్తర్వులు అనుసరించి శ్రీకాకుళం జిల్లాలో అక్రమ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై వచ్చే ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ నంబరు అలాగే ఈ మెయిల్ ఐడీలను ఇచ్చామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై టోల్ ఫ్రీ నంబర్ 1800 -425-6012, ల్యాండ్ లైన్ నెంబర్ 08942-293229 లేదా 9701691657 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, అలాగే ఈ మెయిల్ ద్వారా గానీ ఫొటోలు లేదా వీడియోలు సహాయంతో ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

సగటు వేతనం పెంచాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీలో సగటు వేతనం పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డ్వామా పీడీ జీవీ చిట్టిరాజుని ఆదేశించారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులపై ఆయన సమీక్షించారు. ఉద్యానవన శాఖకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. పేమెంట్స్ నిర్ణీత సమయానికి అవ్వాలని ఆదేశించారు. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు.

కలెక్టరేట్ పరిశీలన..

జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అన్నారు. ఆయన కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లను జేసీ ఎం.నవీన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా ఫైళ్లను నిర్దేశిత కాల పరిమితిలో పరిష్కరించాలని, అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు.

ఆటో మొబైల్ షాపులో అగ్ని ప్రమాదం



మంటలకు కాలిపోయిన స్పేర్ పార్టులు



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ బైపాస్ కూడలి వద్ద ఉన్న పోలమాంబ ఆటో మొబైల్ షాపులో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. దేవుని పటాలు వద్ద ఉన్న బల్బు వేడికి షార్టు సర్క్యూట్ కావటంతో ఒక్కసారి మంటలు వ్యాపించాయి. షాపులో ప్లాస్టిక్ సామగ్రి ఉండటం వల్ల అగ్గి వేగంగా రాజుకుంది. మంటలను స్థానికులు అదుపు చేయలేకపోయారు. దీంతో షాపు యజమాని పైడి ఆనందరావు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు పూర్తిస్థాయిలో అదుపు చేశారు. ఇంజిన్ ఆయిల్ క్యాన్లు, స్పేర్ పార్టులు కాలిపోయాయి. షాపుల్లో రూ.కోటి విలువైన స్పేర్ పార్టులు ఉన్నట్లు యజమాని తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

టెక్కలి రూరల్: టెక్కలి నౌపడ రోడ్డులో గల శ్రీ రాజరాజేశ్వరి గోల్డ్‌షాపులో జూన్ 17వ తేదీన మూడు బంగారపు గొలుసులు చోరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి టెక్కలి ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు కేసునమోదు చేసి విచారణ చేపట్టారు. ఆ చోరీకి పాల్పడిన గండుపల్లి రాజేష్‌తో పాటుగా మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గొలుసులు రికవరీ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ-2 తెలిపారు.

అనారోగ్యంతో తహసీల్దార్ మృతి



జలారి చలమయ్య (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్న తహసీల్దార్ జలారి చలమయ్య(52) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఎన్నికల ముందు సంతబొమ్మాళి మండలం తహసీల్దార్‌గా పనిచేసి, ఎలక్షన్ బదిలీలో భాగంగా రంపచోడవరం తహసీల్దార్‌గా వెళ్లారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం ఉదయం పాతపట్నంలో అంత్యక్రియలు కుటుంబసభ్యులు నిర్వహించారు. మెళియాపుట్టి మండలం నందవ కొత్తూరు ఆయన స్వగ్రామం. గతంలో మెళియాపుట్టి, పాతపట్నం (ఇన్‌చార్జి)తహల్దార్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చలమయ్య మృతిపై పలువురు రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన క్లీనర్ వెంకటరావు

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారం పంచాయతీ జడ్యాడ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్యాడ వద్ద ఉన్న వంశధార కాలువలో పూడికలు తీసివేయడం పూర్తి కావడంతో అక్కడి పొక్లెయినర్‌ను వేరే చోటకు తరలించేందుకు కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన డ్రైవర్ దాట్ల రాము, క్లీనర్ అత్తిని వెంకటరావు(36)తో కలిసి లారీ పెట్టారు. లారీపై పొక్లెయినర్ పెట్టాక జడ్యాడ నుంచి మెళియాపుట్టి రోడ్డు వైపు వస్తుండగా విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉండడం గమనించిన డ్రైవర్ మిషన్‌కు తగులుతాయని గుర్తించి క్లీనర్‌కు చూడమని చెప్పాడు. దీంతో క్లీనర్ వెంకటరావు మీదకు ఎక్కి చెబుతుండగా విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టింది. వెంటనే ఆయనను పొక్లెయినర్ యజమాని కల్యాణ్ మరో వ్యక్తి కలిసి బైక్ మీద టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో వచ్చిన 108 వాహనంలో టెక్కలి ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రికి చేరే లోపే వెంకటరావు మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతి, పదేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేర కు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేశారు.

'బీఆర్ఏయూ వీసీపై మాట్లాడిన తీరు దారుణం'



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి, దళిత మహిళ కేఆర్ రజినిపై అసభ్యకరంగా మాట్లాడడం, అవమానించి, బెదిరించడంతో పాటు కులం పేరుతో దుర్భాషలాడిన అసిస్టెంట్ ప్రొఫెసర్ హనుమంతు సుబ్రహ్మణ్యంను తక్షణమే విధుల నుంచి తొలగించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలన్నిటికీ సూత్రధారి, పాత్రధారి ఆయనేనన్నారు. దళిత మహిళపై కవ్వింపు చర్యలకు పాల్పడితే దళిత సంఘాలు చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు. గతంలో మాజీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ ప్రభుత్వం మారినప్పుడు రాజీనామా చేయలేదు, అప్పుడు ఏమయ్యాయి ఈ నీతులన్నీ అని మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్‌లు మాట్లాడుతూ ఎవరికైనా తమ హక్కులు, స్వప్రయోజనాల కోసం నిరసన, ఆందోళన చేసుకునే హక్కు ఉందని, కానీ ఈ నెల 4న యూనివర్సిటీలో తెలుగు నాడు విద్యార్థి సంఘం నాయకులు వీసీ, రిజిస్టర్ పైల సుజాతలపై అసభ్యకరంగా మాట్లాడడం అవమానకరంగా తిట్టడం, చులకనగా చూడటం కులం పేరుతో తిట్టడంతో పాటు రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తూ బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. గత 15 ఏళ్ల కాలంలో విద్యార్థుల సమస్యలపై ఏనాడూ పోరాడని తెలుగు నాడు విద్యార్థి సంఘం నాయకులు ఇప్పుడు హఠాత్తుగా దర్శనం ఇవ్వడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే జిల్లా దళిత ఆదివాసీ సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. సమావేశంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు బైరి ధనరాజ్, మాలమహానాడు జిల్లా నాయకులు సాంబరికి సూరిబాబు, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు, సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు వాన్నాలి లక్ష్మీనారాయణలు బస్కల లక్ష్మీనారాయణ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షులు కానుకుర్తి గోవింద్, దుప్పాడ జగన్నాథం, పప్పాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

వీసీపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో దళిత మహిళగా, మేధావిగా వర్సిటీలో సంస్కరణలు చేపడుతున్న వీసీ కేఆర్ రజినిపై కూటమి ప్రభుత్వం రాజీనామా చేయాలని ఒత్తిడి పెంచుతోంది. రాజీనామాకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుంచి అనేక సార్లు ఒత్తిళ్ల వచ్చినా ఆమె మాత్రం పాలనపై ప్రత్యేక దృష్టిపెడుతూ వచ్చారు.

చివరకు ప్రత్యక్షంగా తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) నాయకులు వీసీ, రిజస్ట్రార్ రాజీనామా చేయాలని కోరుతూ ప్రత్యక్ష నిరసనకు గురువారం దిగారు. ఈ నేపథ్యంలో ఆమెకు దళిత ఉద్యోగులు, సంఘాలు మద్దతుగా నిలిస్తున్నారు. మహిళలు సైతం సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. వీసీ కూడా ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొని ముందుకు సాగుతున్నారు.

ప్రత్యక్ష బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై జాతీయ మహిళా కమిషన్, మానవ హక్కుల సంఘం వంటి వాటికి ఫిర్యాదు చేసేందుకు సైతం సిద్ధమవుతున్నారు.

చెరువుపై అధికార పార్టీ నాయకుల కన్ను



మల్లిపెద్దివానిచెరువు

- రూ.5 కోట్ల విలువైన స్థలం
- అధికారులు దృష్టికి సమస్య తీసుకు వెళ్లిన సర్పంచ్, ఎంపీటీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రోజులు గడవక ముందే విలువైన ప్రభుత్వ స్థలాలపై అధికార పార్టీ నాయకులు కన్నేస్తున్నారు. ప్రస్తుతం బొంతలకోడూరు గ్రామ సమీపంలో ఉన్న మల్లిపెద్దివాని కోనేరును కప్పేసి కబ్జా చేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ మేరకు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీష్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. రెవెన్యూ అధికారులు సైతం క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

బొంతలకోడూరు గ్రామానికి అతి సమీపంలో ఈ మల్లిపెద్దివాని చెరువు ఉంది. సర్వే నంబర్ 39లో 2.61 ఎకరాలు విస్తీర్ణం గల ఈ చెరువు స్థలం రూ. 5 కోట్లు విలువ చేస్తుంది. ఈ విలువైన స్థలాన్ని కొందరు నాయకులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం ప్రారంభించారు. గతంతో ఈ చెరువు ఆక్రమణల్లో ఉండేది. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ స్పందన ఫిర్యాదు మేరకు అప్పటి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాలతో ఆక్రమణలు తొలగించారు. 2023 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ. 9 లక్షల పనులు మంజూరు చేశారు. ఈ మేరకు రూ. 4.50 లక్షలు పనులు పూర్తిచేశారు. ఇంకా రూ.4.50 లక్షల పనులు నిర్వహించాల్సి ఉంది. మరో పక్క రైతులు స్వచ్ఛందంగా తమ పొలాలను ఆనుకుని గట్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉపాధి పనులు జరగనివ్వడం లేదు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు రాత్రి వేళ చెరువును జేసీబీ, పొక్లెయినర్స్‌తో కప్పేసి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. చెరువు కింద 70 ఎకరాల వరకు ఆయకట్టు సైతం ఉంది. చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు..

చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలు జారీ చేశాం. ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. చెరువును సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాం. చెరువుల ఆక్రమణ చట్టరీత్యా నేరం.

– ఎం.శ్యాంకుమార్, తహసీల్దార్, ఎచ్చెర్ల

అంగన్‌వాడీ నుంచి ప్రభుత్వ పాఠశాలకు..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 19వ వార్డు సూదికొండ ప్రభుత్వ పాఠశాలకు అడ్మిషన్లు ఊహించని రీతిలో పెరగుతున్నాయి. జీడి కార్మికులు అధికంగా ఉన్న సూదికొండ ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు నాడు-నేడులో నూతన భవనాలు నిర్మించి పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి నేరుగా 31 మంది చిన్నారులు ఒకటో తరగతిలోకి అడ్మిషన్లు పొందారు.